క్లుప్తంగా

మహిళలకు బహుమతి

మండపేట: గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. ఆ పార్టీ మండపేట కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర నిర్ణయం సామాన్యులకు ఎంతో ఊరట ఇస్తోందన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈ తగ్గింపు ప్రధాని నరేంద్ర మోదీ తన సోదరీమణులకు ఇచ్చిన బహుమతి అని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ తోటకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



ఎమ్మెల్సీ తోటకు రాఖీలు కడుతున్న బ్రహ్మకుమారీలు

మండపేట: రాఖీ పండుగ సందర్భంగా పట్టణంలోని ఓం శాంతి బ్రహ్మకుమారీలు బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు రాఖీలు కట్టారు. ప్రజలకు మేలు చేసే విధంగా ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట బ్రహ్మకుమారీలకు స్వీట్లు అందజేశారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

రామచంద్రపురం రూరల్: శ్రావణ పౌర్ణమిని బుధవారం రామచంద్రపురం పట్టణం, మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. పలు గ్రామాలలో చిన్నారులతో పాటు పెద్దలు కూడా తమ సోదరులకు రాఖీలు కట్టి సందడి చేశారు. రాఖీని కట్టడం ద్వారా తమ సోదరులకు భగవంతుని అనుగ్రహం ఉండాలన్న ఉద్దేశంతో ముందుగా తమ ఇష్టదైవాల ముందు ఉంచిన రాఖీలను తమ సోదరులకు కట్టి, వారికి మిఠాయిలు తినిపించారు. సోదరులు తమ సోదరీమణులకు బహుమతులను అందజేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

క్రైస్తవులకు సీట్లు కేటాయించాలి

మండపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు క్రైస్తవులకు ప్రత్యేకంగా కొన్ని అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని క్రిస్టియన్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీజే ఇశ్రాయేలురాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మండపేటలో ఒక ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవుల వాస్తవ జనాభా ప్రాతిపదికన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి తమకు అవకాశం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోను అధికారంగా క్రైస్తవులు 3 నుంచి 4 శాతం ఉన్నప్పటికీ అనధికారంగా 17 శాతం మించి ఉన్నారన్నారు. కొన్ని చోట్ల అయితే సమాంతరంగా కూడా ఉన్నారన్నారు. క్రైస్తవులు సామాజికంగా రాజకీయంగా ముందడుగు వేసేందుకు ప్రభుత్వాలు, పాలకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువుల యాజమాన్యంపై శ్రద్ధ చూపాలి

కాజులూరు: వరి సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు తగిన శ్రద్ధ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం గొల్లపాలెం, బందనపూడి తదితర గ్రామాల్లో ఏటి పంట పొలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలపై రైతులు అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు వాడటం అనర్థాలకు దారితీస్తుందన్నారు. పంటలకు సోకే తెగుళ్ళు, వాటి ఉధృతి, పంట స్థితిగతులకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. రెండు, మూడు రకాల మందులను కలిపి వాడుతుండటంతో ఏ మందు పనిచేయక వృథా వ్యయం అవుతుందన్నారు. సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మేలైన దిగుబడులు సాధించాలన్నారు.

అమ్మవారికి ఆభరణాల సమర్పణ



ఆభరణాలు సమర్పించిన వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీమధ్యాహ్నం అమ్మవారికి కాకినాడకు చెందిన ఓగిరాల వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు రూ.1,70,000 విలువైన బంగారు, వెండి ఆభరణాలను సమర్పించారు. బంగారు త్రినేత్రం, వెండి కుంకుమ భరిణి, అమ్మవారి హస్తాలను ఆలయ నిర్వాహకులకు బుధవారం అందజేశారు. అర్చకులు వాటిని అమ్మవారికి అలంకరించారు. దాతలను అభినందించారు. అమ్మవారు తమ ఆరాధ్య దైవంగా కొలుస్తామని దాతలు అన్నారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు హేమశ్రీ, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ప్రచారం

కాజులూరు: గొల్లపాలెంలో 'ఇంటింటికీ జనసేన' కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొండా వెంకన్న ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.

అందుబాటులో ఆధార్ సేవలు

- నవీకరణతో ప్రభుత్వ లబ్ధి సులభతరం
- 2010 -2016 మధ్య ఒక్కసారైనా నవీకరించుకోవాలి
- చేసుకోనివారికి సచివాలయాల్లో వెసులుబాటు
- ఈ నెల 22 నుంచి 25 వరకూ ప్రత్యేక శిబిరాలు
- రెండు నియోజకవర్గాల్లో 977 మందికి నవీకరణ



నేలటూరు శిబిరంలో ఆధార్ నవీకరణ చేస్తున్న దొరబాబు (ఫైల్)

కపిలేశ్వరపురం: సాంకేతిక సమస్యలతో ప్రజలు పలు విధాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అన్ని సేవలకూ ఆధార్ తప్పనిసరి కావడంతో ఆధార్ కార్డులోని వివరాలు సవివరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం ఆధార్ కార్డు నవీకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహిస్తోంది. గతేడాది అక్టోబర్ 25 నుంచి దశలవారీగా కేంద్రాలను పెంచుకుంటూ నవీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. దాని కొనసాగింపులో భాగంగా ఈ నెల 22 నుంచి 25 వరకూ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను నిర్వహించింది. సచివాలయాల్లో నవీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

నవీకరణ ఎందుకోసమంటే...

పదేళ్ళు క్రితం ఆధార్ చేయించుకున్నవారి వివరాల్లో మార్పులు ఉండటమూ, వేలిముద్రలు పడకపోవడమూ, గతంలో ఆధార్ చేసినపుడు వివరాలు తప్పుగా నమోదు కావడం జరిగి ఉండొచ్చు. వాటి వల్ల ప్రభుత్వ పథకాలను పొందడంలో తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నవీకరణ చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. వేలిముద్రలు, ఐరిష్, ఫొటో, వయస్సు, ఇంటి అడ్రస్ తదితర వివరాలను నవీకరించుకోవాల్సి ఉంది.

రెండు నియోజకవర్గాల్లో ఈనెల 22 నుంచి 25 వరకూ నవీకరణ ఇలా...

మండలం	శిబిరాలు	నవీకరణలు
ఆర్సీపురం పట్టణం	02	102
ఆర్సీపురం రూరల్	02	54
కె.గంగవరం	02	218
మండపేట పట్టణం	02	102
మండపేట రూరల్	02	284
రాయవరం	02	74
కపిలేశ్వరపురం	02	143
మొత్తం	14	977

నవీకరణ ప్రత్యేక శిబిరాలిలా...

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలాల్లో ఈనెల 22 నుంచి 25 వరకూ నిర్వహించారు. మండలానికి రెండు చొప్పున నాలుగు రోజుల పాటు తర్ఫీదు పొందిన డిజిటల్ అసిస్టెంట్లు నవీకరణ చేశారు. కపిలేశ్వరపురం మండలంలో గతేడాది అక్టోబర్ నుంచి నవీకరణ ప్రక్రియ సాగుతోంది. వాకతిప్ప, వడ్లమూరు, కోరుమిల్లి, కాలేరు, కపిలేశ్వరపురం, వల్లూరు, నేలటూరు, మాచర, నల్లూరు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ సేవలందించారు. ఇప్పటి వరకూ ఆధార్ కార్డు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు.

ఆధార్ కార్డుల నేపథ్యమిలా..

తొలిసారిగా 2011లో కేంద్ర ప్రభుత్వం కార్డులను జారీ చేసింది. అప్పటి నుంచి నవీకరణ పెద్ద సమస్యగా ఉండేది. పన్నెండేళ్లకు ఒకసారి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఇటీవల కేంద్రం స్పష్టం చేసింది. 2010-2016 లోపు ఆధార్ పొందిన మధ్యలో అప్‌డేట్ చేసుకోకుండా ఉంటే తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. 15 ఏళ్ల నిండిన పిల్లలందరి ఆధార్‌ను సవరించాలన్నది లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. మీసేవ కేంద్రాలకు ఆ అవకాశం ఇచ్చినప్పటికీ అధిక రుసుము వసూలు చేయడం, సర్వర్ సమస్యలు, కేంద్రాల నిర్వాహకుల్లో అవగాహన లోపాల కారణంగా ప్రజలు నవీకరణ ఆలోచన చేసేవారు కాదు. సచివాలయ వ్యవస్థ రావడంతో అవగాహన పెంచుకున్న ప్రజలు స్థానికంగానో, సమీపానో ఉన్న సచివాలయాన్ని సంప్రదించి నవీకరణ చేసుకుంటున్నారు.

నవీకరణ ప్రక్రియ ఇలా...

ఆధార్ కార్డుల జారీ సంస్థ యునిక్ ఐడెంటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఐ) సంస్థ నవీకరణకు నిబంధనలను విడుదల చేసింది. ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలనుకునే వారు సమీపంలో ఆధార్ నవీకరణ సేవలందిస్తున్న సచివాలయానికి వెళ్ళాలి. పుట్టిన తేదీని సరిచేసుకునేందుకు రుజువుగా పదో తరగతి మెమో, పాస్‌పోర్టు, పాన్ కార్డులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. చిరునామా మార్పు కోసం బ్యాంక్ ఖాతా, పోస్టాఫీసు ఖాతా, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు అప్ లోడ్ చేయాలి. చిన్నారులకు వారి తల్లిదండ్రుల వేలిముద్రలతో కార్డు జారీ చేస్తారు. ఐదేళ్ళు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లల వేలిముద్రలు, ఫొటో అప్‌డేట్ చేస్తారు. తొలిసారి ఆధార్ చేసుకునే పిల్లలకు ఉచితంగా చేస్తారు.

నా ఆధార్‌ను నవీకరించుకున్నా..



నా ఆధార్ కార్డును ఇటీవల నిర్వహించిన ఆధార్ శిబిరంలో నవీకరించుకున్నాను. ఫింగర్ ప్రింట్, ఫొటో, మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేయించుకున్నాను. గతంలో మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది నేడు స్థానికంగానే సేవలందించడం అభినందించతగినది.

– కణ్వ మహర్షి, పామర్రు, కె.గంగవరం మండలం

● ఆత్మీయ స్వాగతం



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్

రామచంద్రపురం: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇర్రిపాకలోని హెలిపాడ్ వద్ద సీఎంకు ఆయన పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.

పైపులైన్ లీకేజీతో ఇబ్బందులు



రాయవరంలో పైపులైన్ లీకేజీతో రోడ్డుపైకి చేరిన నీరు

రాయవరం: రాయవరం పంచాయతీ పరిధిలో పైపులైన్ లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో పైపులైన్‌కు లీకేజ్ ఏర్పడింది. దీంతో రక్షిత మంచి నీరు లీకై రోడ్డుపైకి ప్రవహించడంతో రోడ్డంతా మడుగులా, బురద మయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. పైపులైన్ లీకేజీ నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో చేరువైన వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ దుర్గారావు దొర

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువ చేసేందుకు ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర సూచించారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో 110 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలకు బుధవారం అంబికపల్లి అగ్రహారంలోని రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గారావుదొర మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ నెలకు రెండు సార్లు నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో బీపీ, షుగర్, ఇతర వ్యాధుల రోగులను గుర్తించి వారికి ఉచితంగా నిర్వహించే 14 రకాల ల్యాబ్ పరీక్షలు, 105 రకాల మందులు అందించి సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులకు తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఉచిత ప్రయాణం ద్వారా ప్రభుత్వ పెద్ద ఆసుపత్రుల్లో చికిత్స అందించేలా చూడాలన్నారు. జిల్లా ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ సుమలత మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా బీపీ, షుగర్, ఇతర వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి వైద్యులతో చికిత్స చేయించాలన్నారు. గర్భిణులకు తరచూ వైద్య పరీక్షలు చేయించి, హైరిస్క్ ఉన్నవారిని ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయడం ద్వారా మరణాలు తగ్గించాలన్నారు. రామచంద్రపురం సబ్ డివిజనల్ అధికారి డాక్టర్ ఆర్.సుదర్శన్‌బాబు, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బర్ల, డైరెక్టర్ రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు మేలు

- డీఎం హెచ్ఓ దుర్గారావుదొర
- అచ్యుతాపురం పీహెచ్‌సీ సందర్శన



పీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ దుర్గారావుదొర

కపిలేశ్వరపురం: అన్ని సదుపాయాలతో నడుస్తున్న ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు మేలని డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావుదొర అన్నారు. మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల వివరాలను వైద్యాధికారి కరుణేంద్రకుమారి వివరించారు. డీఎంహెచ్ఓ దుర్గారావుదొర ఆసుపత్రిలోని మందులు, రికార్డులను తనిఖీ చేశారు. లక్ష్యం మేరకు ఆసుపత్రిలో ప్రసవాలు జరిపేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిరంతరం సేవలను మెరుగుపరచడం ద్వారా ఆసుపత్రిలో వైద్యసేవల కోసం ప్రజలు మొగ్గు చూపుతారన్నారు. ఆయన వెంట ఎంపీహెచ్ఎస్ ఎస్.నూకరాజు, సిబ్బంది ఉన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు విజ్ఞాన కేంద్రాలు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష సీఎంవో సుబ్రహ్మణ్యం

రాయవరం: ఉపాధ్యాయులు తమ అనుభవాలను పరస్పరం మార్పిడి చేసుకునే జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండాలని సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమైన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి నెలా జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు తమ బోధనా సామర్థ్యాలను మెరుగు పరుచుకునేందుకు వినియోగించుకోవాలన్నారు.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధనా పద్ధతులు కూడా అభివృద్ధి చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 సూర్యనారాయణ, మూడు మండలాల పరిధిలోని సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామోపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్



సంఘ నూతన కార్యవర్గంతో వ్యాయామోపాధ్యాయులు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బుధవారం వ్యాయామోపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి అప్పారెడ్డి, మండపేట నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సిద్ధాంతపు వీర్రాజు సమక్షంలో వ్యాయామోపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించారు. సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్ల జాబ్ చార్ట్‌పై చర్చించారు. వ్యాయామ విద్యలో భాగంగా హెల్త్ ఎడ్యుకేషన్, యోగా క్రీడా నైపుణ్యాలను ఎలా నేర్పాలి అనే విషయాలను చర్చించారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

మండపేట నియోజకవర్గ స్థాయి వ్యాయామోపాధ్యాయుల సంఘ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నికున్నారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా సిద్ధాంతపు వీర్రాజు, భ్రమరాంబ, జోన్ అధ్యక్షుడిగా సీహెచ్ కృష్ణారావు(తాపేశ్వరం జెడ్పీహెచ్ఎస్), కార్యదర్శిగా వేణుగోపాలరావు (కపిలేశ్వరపురం జెడ్పీహెచ్ఎస్), నిర్వహణా కార్యదర్శిగా సీహెచ్ లక్ష్మీశ్రీనివాసరావు (మండపేట జీహెచ్ఎస్), కోశాధికారిగా ఎస్.కృష్ణప్రసాద్ (జెడ్పీహెచ్ఎస్, వెదురుపాక) ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎం.సత్యనారాయణ (జెడ్పీహెచ్ఎస్, వల్లూరు), దీప్తి ఎస్తేర్ (మండపేట బాలికల ఉన్నత పాఠశాల)లు ఎన్నికయ్యారు.

వైభవంగా అష్టోత్తర కలశ పూజ



చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో అష్టోత్తర కలశపూజ చేస్తున్న భక్తులు

ఆలమూరు: చింతలూరులో వేంచేసి ఉన్న శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని అష్టోత్తర కలశ పూజ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు ఊరేగింపుగా తీసుకు వచ్చిన గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. అలాగే ఆలమూరులోని శ్రీసంతోషిమాత ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

అంతర్వేదిలో నవవార దీక్ష



అంతర్వేదిలో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నవవార, నవప్రదక్షిణ దీక్షలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి అనుగ్రహంతో పాటు, సకల అభీష్టాలు నెరవేరడానికి ఈ ప్రదక్షిణ తోడ్పాటు ఇస్తుందని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు తెలిపారు. తొలుత స్వామివారి సన్నిధిలో భక్తుల గోవింద నామస్మరణల మధ్య ఆలయ ప్రదక్షిణను అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రారంభించారు.

అంబాజీపేట: నందంపూడి శివారు పెచ్చెట్టివారిపాలెంలో లక్ష్మీగణపతి స్వామివారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెచ్చెట్టి లక్ష్మీ నాగేశ్వరరావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. యలమంచలి సుబ్రహ్మణ్యశర్మ, చంద్రమౌళి సురేష్ శర్మ పర్యవేక్షణలో పెచ్చెట్టి వీరవెంకట సత్యనారాయణ, కృష్ణవేణి దంపతులు, భక్తులచే స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుబ్బల మాధవేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠ

పి.గన్నవరం: బెల్లంపూడి శివారు తాడాలవారిపాలెంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో వరసిద్ధి వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 28 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: జాతీయ రహదారులు వెడల్పు పనుల్లో భాగంగా ఏపీ ట్రాన్స్‌కో టవర్లను మార్పు చేస్తున్నట్లు, దీంతో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస ప్రభు, రామచంద్రపురం, అమలాపురం, కాకినాడ ఏపీ ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, వై.విజయానంద్, జి.ప్రసాద్‌లు బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. కోనసీమకు ప్రధానమైన 132 కేవీ కాకినాడ- రామచంద్రాపురం లైన్లలో ఉదయం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం ఏరియాలలో ఎప్పుడైనా కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మణిపూర్ మృతులకు నివాళులు



మృతులకు నివాళులు అర్పిస్తున్న ఫెలోషిప్ సభ్యులు, నాయకులు

కె.గంగవరం: స్థానిక చిన్నమండ చర్చిలో బుధవారం నియోజకవర్గంలోని పలు క్రైస్తవ సంఘాలకు చెందిన ఫెలోషిప్ సభ్యులు మణిపూర్ మృతులకు నివాళులు అర్పించారు. ఐక్యతతో ప్రార్థన చేద్దాం కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఫెలోషిప్ నాయకులు, సభ్యులు, సంఘ విశ్వాసులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ జిల్లా నాయకుడు జెకర్యా మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన దారుణమైన సంఘటనలు అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్ షెల్టర్ నిర్మించండి



గొల్లపాలెంలో గణపతి హాలు తొలగించిన ప్రాంతం

కాజులూరు: కాకినాడ- కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం మార్కెట్ జంక్షన్ వద్ద ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు ఇది ప్రధాన కూడలి. ఇక్కడ నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సులు ఎక్కుతుంటారు. గతంలో గణపతి హాలులో కొంత భాగాన్ని కచేరి చావిడిగా వినియోగించి, మరికొంత ప్రయాణికులు విశ్రాంతి భవనంగా వినియోగించేవారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 12 ఏళ్ల కిందట అధికారులు గణపతి హాలును తొలగించారు. అనంతరం ఆ స్థలంలో స్థానిక ఐడియల్ యూత్ సభ్యులు తాటాకులతో పాక వేసి బస్ షెల్టరు ఏర్పాటు చేశారు. క్రమేపి అదీ శిథిలమైంది. అధికారులు స్పందించి ఇక్కడ బస్ షల్టర్ నిర్మించాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు రేకపల్లి సత్తిబాబు, అంగర శ్రీను, పోలిశెట్టి గనిలక్ష్మి కోరుతున్నారు.

హిందూ మత పవిత్రతను కాపాడాలి

కె.గంగవరం: దేవాలయాల్లో హిందూ మత పవిత్రను కాపాడే వ్యక్తులనే నియమించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి డిమాండ్ చేశారు. కె.గంగవరంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం పార్టీ ఆదేశాల మేరకు భక్తుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ ధర్మాదాయ శాఖలో ఉద్యోగులు, పాలక మండలి అధ్యక్షులు, సభ్యులుగా హిందూమత పవిత్రను కాపాడే వారికే ఇవ్వాలన్నారు. కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, జిల్లా స్వచ్ఛ భారత్ కోకన్వీనర్ రామకృష్ణ, మండల యువమోర్చా అధ్యక్షుడు కాదా వీరవెంకట రమణ పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఎమ్మెల్యే వేగుళ్ల చేసింది శూన్యం

మండపేట: ప్రచార ఆర్భాటమే తప్ప నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేసింది శూన్యమని వైఎస్సార్ సీపీ మహిళ విభాగం నాయకురాలు ఓగిరాల దేవి విమర్శించారు. పట్టణంలోని తన ఆఫీసు వద్ద బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యే వేగుళ్ల రూ. వెయ్యి కోట్లతో నియోజకవర్గానికి ఏమీ చేయలేదని, ఆయన సొంత వ్యాపారాభివృద్ధి చేసుకున్నారని విమర్శించారు. కేశవరం, ద్వారపూడి గ్రామాల్లో రూ. కోట్ల విలువైన గ్రావెల్‌ను అక్రమంగా మండపేటలో తన సొంత లే అవుట్లకు తరలించుకున్నారన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు లభిస్తున్న జనాధరణను చూసి ఓటమి భయంతో టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన నన్ను టీడీపీలో చేరాలని ఎంతో మంది టీడీపీ నాయకులు ఒత్తిడి తెచ్చినా వెళ్లలేదని ఆమె తెలిపారు. ఆ అక్కసుతోనే సొంత పనుల కోసం నేను వైఎస్సార్ సీపీలో చేరానని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పేదల పక్షాన నిలిచే ఎమ్మెల్సీ తోట నాయకత్వానికి ఆకర్షితులై తాము పార్టీలో చేరానని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని దేవి స్పష్టం చేశారు.